ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నేడే ఓట్ల పండగ

◆ పోలింగ్‌కు సర్వం సిద్ధం ◆ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పటిష్ట పోలీసు బందోబస్తు

◆ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్

సార్వత్రిక ఎన్నికలు మరికొన్ని గంటల్లో ప్రారంభంకానున్నాయి. పోలింగ్‌కు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ సందర్భంగా ఎటుంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పోలీసు అధికారులు గట్టి బందోబస్తును సిద్ధంచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను నియమించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సామగ్రితో బయలుదేరారు.



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున



అనకాపల్లి నుంచి పోలింగ్ విధులకు వెళ్తున్న ఉద్యోగులు

అనకాపల్లిలో..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి ఇవిఎం పంపిణీ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. అనకాపల్లి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని, ఎస్‌పి కెవి.మురళీకృష్ణ సందర్శించి పోలీసు సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశారు. జిల్లాలోని 1529 పోలింగ్ కేంద్రాల్లో 12,89,371 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 6,27,321 మంది, మహిళలు 6,62,022 మంది, థర్డ్ జండర్ 28 మంది వున్నారు. పోలింగ్ నిర్వహణలో పిఓలు 1759 మంది, ఎపిఓలు 1759 మంది, ఒపిఓలు 1743 మంది, సూక్ష్మపరిశీలకులు మిగతా 2లో..

విశాఖలో...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లతో సిద్ధమైంది. విశాఖ జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ స్థానాల్లో 20,12,373 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ సిబ్బంది సుమారు 13 వేల మంది పైచిలుకు విధుల్లో ఉండనున్నారు. వైసిపి, టిడిపి, జనసేన బిజెపి, ఇండియా వేదికలోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ సహా ఇండిపెండెంట్ అభ్యర్థులు, జై భారత్ నేషనల్ పార్టీ, బిఎస్‌పి తదితర పక్షాలు బరిలో ఉన్నాయి. విశాఖ పార్లమెంట్ పరిధిలో వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, టిడిపి నుంచి ఎం.శ్రీభరత్, కాంగ్రెస్ నుంచి సత్యారెడ్డి, ప్రజాశాంతి పార్టీ నుంచి కెఎ.పాల్ తదితరులు పోటీలో ఉన్నారు. విశాఖ తూర్పు, పశ్చిమం, ఉత్తరం, దక్షిణం, గాజువాక, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గాలు విశాఖ జిల్లాలో ఉన్నాయి. పలుచోట్ల ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు నడుస్తుండగా గాజువాకలో సిపిఎం, వైసిపి, టిడిపి మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎన్‌డిఎ కూటమిలోగల టిడిపి, జనసేన, బిజెపి, రాష్ట్రంలోని అధికార వైసిపి అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో రూ.కోట్లు ఖర్చుచేస్తూ ఓటర్లను తమవైపు లాక్కోడానికి గడచిన 10 రోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఓటుకు నోట్లు ఏ పార్టీ అభ్యర్థి ఇస్తే వారివైపు జనం ఓట్లేస్తారన్న నమ్మకంతో వైసిపి, టిడిపి, బిజెపి ప్రధానంగా డబ్బు పంపకంలో విశాఖలో పోటీపడ్డాయి.

అత్యధిక ఓటర్లు భీమిలిలోనే...

విశాఖ జిల్లా పరిధిలోగల ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో భీమిలిలోనే అత్యధికంగా ఓటర్లు 3.63 లక్షల పైచిలుకు ఉన్నారు. మహిళా ఓటర్లు ఇక్కడే అధికం. అత్యల్పంగా ఓటర్లు పశ్చిమంలో 2.13 లక్షల మంది ఉన్నారు. విశాఖ జిల్లా మొత్తంగా పురుష ఓటర్లు 9,92,800 మంది, మిగతా 2లో..

బీచ్ రోడ్డులో నగదు పట్టివేత

▶ వార్త మెయిన్‌లో..

'ఉక్కు' పరిరక్షణే ప్రధాన ధ్యేయం

▶ వార్త మెయిన్‌లో..

యువకుల ప్రాణం తీసిన అతివేగం

▶ వార్త మెయిన్‌లో..



ద్వారకా బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ఓటర్లు



కిటకిటలాడుతున్న రైలు బోగీ

బస్సులు, రైళ్లు కిటకిట

సార్వత్రిక ఎన్నికల వేళ ఓటు వేసేందుకు సొంతూళ్లకు ఓటర్లు బయలుదేరడంతో ఆదివారం విశాఖలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రద్దీగా కనిపించాయి. బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి. ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఆర్‌టిసి కొన్ని బస్సులను మళ్లించడంతో ప్రయాణికులకు అనివార్యంగా ఇబ్బంది ఏర్పడింది. ఎక్కువ మంది ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదునుగా ప్రైవేటు వాహన నిర్వాహకులు రెట్టింపు ఛార్జీలు వసూలు చేశారు. విశాఖ మీదుగా వెళ్లిన ప్రతి రైలూ ఆదివారం రద్దీగానే కనిపించింది.

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఓటింగ్ 80 శాతానికి తగ్గరాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం జరిగే ఎన్నికల పండగలో అందరూ భాగస్వామ్యం కావాలని, ఓటింగ్ శాతాన్ని 80 శాతానికి తగ్గకుండా నమోదు చేసేలా ఓటర్లందరూ బయటకు వచ్చి తమ అమూల్యమైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. 2019లో విశాఖ జిల్లాలో 66 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయని, ఈ సారి 80 శాతానికి మించి ఓట్లు పోల్ కావాలని ఆకాంక్షించారు.

నేడే ఓట్ల పండగ



మాట్లాడుతున్న తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్

ఓటును సద్వినియోగం చేసుకోండి

- తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగపరుచుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన తిరుగులేని ఆయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయడాన్ని గర్వకారణంగా భావించాలన్నారు. రాష్ట్ర ప్రగతిలోనూ, దేశ ప్రగతిలోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగు తుందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంతో వీలైనంతవరకు పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేసేందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని పనులున్నప్పటికీ మొదటి ప్రాధాన్యత ఓటు హక్కును వినియోగించుకోవడానికే ఇవ్వాలన్నారు. ఓటు ప్రాధాన్యతను గుర్తించి సుదూర ప్రాంతాల నుంచి కూడా తరలి వచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. పోలింగ్ అధిక శాతం జరిగితే ప్రజల మెజారిటీ అభిప్రాయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. కనీసం 90 శాతం వరకు పోలింగ్ జరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థ ఘనవిజయం సాధించినట్టేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించుకోవాలని, అందుబాటులో ఉన్న అభ్యర్థులలో మంచి గుణ గుణాలు కలిగినవారికి, ప్రజలకు అందుబాటులో ఉండే వారికి ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను రక్షించలేని అభ్యర్థికి, ప్రజలకు అందుబాటులో ఉండని అభ్యర్థికి ఓటు వేస్తే మరో ఐదేళ్లపాటు మంచి పరిపాలన కోసం ఎదురుచూడాల్సి వస్తుందన్నారు. మనలో చాలామందికి అవినీతి, అక్రమార్కులను ప్రశ్నించాలని ఉంటుందన్నారు. అయితే వివిధ కారణాలవల్ల ప్రశ్నించలేని వారు తమ ఓటునే ఆయుధంగా ఉపయోగించు కోవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఆలూరి విష్ణువర్ధన్, జి.జగదీష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధనరావు

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డబ్బుకు, ప్రలోభాలకు లొంగకుండా నాగవంశం సామాజిక తరగతి వారంతా సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాగవంశం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ గెలుపు కోసం డబ్బును ఖర్చు చేసి, విజయం పొందిన తర్వాత పెద్ద ఎత్తున ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని, ఇటువంటి నాయకుల వల్ల మేలు జరగదని అన్నారు. రాష్ట్రంలో ఏటా మూడు లక్షల మంది ఇంజినీరింగ్ చదువుకున్న వారు పట్టాలు తీసుకుంటున్నారని, అయితే వీరిలో లక్ష మందికి మాత్రమే ఉపాధి లభిస్తోందని తెలిపారు. మిగిలిన రెండు లక్షల మంది ఎటువంటి ఉపాధీ లేక విద్యతో సంబంధంలేని పనులు చేసుకుని జీవనం చేయడం, లేదా ఇతర ప్రాంతాలకు వలసలు పోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల పాలనపై నమ్మకాలు పోయాయన్నారు. రాష్ట్రానికి రాజధాని లేదన్నారు. పోలవరం పూర్తి కాలేదన్నారు. నాగవంశీయులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటయినప్పటికీ, దానికి నిధులు కేటాయించలేదన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి...)

అనకాపల్లిలో..

7036 మంది పాల్గొననున్నారు. చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు 3,666 బ్యాలెట్ యూనిట్లు, 3,666 కమిషనింగ్ యూనిట్లు, 3,968 వివిపాట్‌లు ఉపయోగించనున్నారు. బియులు 996, సియులు 127, వివిపాట్‌లు 506, రిజర్వులో వుంచారు.

1529 పోలింగ్ కేంద్రాలలో 340 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు గుర్తించారు. ఆ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా బలగాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. బందోబస్తులో పోలీసులతో పాటు కేంద్ర బలగాలు పాల్గొంటున్నాయి. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో వుంది. ఐదుగురుకు మించి గుంపుగా తిరగకూడదు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవరూ ఉండరాదు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఓటర్లు తమ వాహనాలు నిలిపివేయాలి. ఓటింగ్ విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు. రూట్ మొబైల్, క్యూఆర్‌టి టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. మద్యం, నగదు పంపిణీ చేస్తున్న వారిపై ఫిర్యాదుచేసేందుకు సి విజిల్ యాప్ ద్వారాగానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కుగానీ తెలియజేస్తే చర్యలు తీసుకునేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు.



విశాఖ నుంచి తమకు కేటాయించిన ప్రాంతాలకు బస్సులో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెంబర్లు

పోలింగ్‌కు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నెంబరు 1950, 112 08924226599 నెంబర్లను అందుబాటులో వుంచారు. జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌లోని 9440904229 నెంబర్‌కు ఫొటోలు, వీడియోలతో సమాచారం పంపించ వచ్చు. సమాచారం పంపించిన వారి వివరాలు గోప్యంగా పోలీసులు వుంచనున్నారు.

విశాఖలో...

మహిళా ఓటర్లు 1019,449 మంది ఉన్నారు.

వలస ఓటర్లపై దృష్టిసారించిన ప్రధాన పార్టీలు

విశాఖ నగరంలో అపార్టుమెంట్‌లు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో పనిచేస్తున్న కార్మికులు, వాచ్‌మెన్‌లు అంతా తమ తమ గ్రామాలకు ఆదివారమే తరలిపోయారు. వీరిలో ఎక్కువ మంది విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలవారే ఉన్నారు. . అలాగే తెలంగాణ, బెంగళూరు, చెన్నయ్‌ల్లో ఉన్న విశాఖకు చెందిన వేల సంఖ్యలోని ఓటర్లు ఆదివారం నాటికి విశాఖ చేరుకున్నారు. వలస ఓటర్లపై ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. వారికి రవాణా ఖర్చులు, తాయిలాలు ఇచ్చిమరీ స్వస్థలాలకు రప్పించాయి.

18న కన్యకాపరమేశ్వరి ఉత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్‌టౌన్ ప్రాంతంలో 147 సంవత్సరాల చరిత్రగల శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 18న వైశాఖ శుద్ధ దశమి నాడు కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘ అధ్యక్షులు అరిశెట్టి దినకర్ ఆదివారం తెలిపారు. 18న తెల్లవారుజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, రజిత వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పములతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవి మూల మంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పేదలకు అన్నదానం నిర్వహించుచున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని దేవాలయ కార్యకర్తల సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ ఉప్పల భాస్కరరావు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్, కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్లు బాదం దినేష్, డాక్టర్ గోగుల సువర్ణ కుమార్, కడిమిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

డబ్బులు అందలేదని ఆందోళన

తమకు ప్రధాన రాజకీయ పార్టీలు పంపిణీ చేసిన డబ్బులు అందలేదంటూ విశాఖలోని పలుచోట్ల ఆదివారం ఓటర్లు ఆందోళన చేపట్టారు. ఈ సంస్కృతిపై రకరకాల చర్చలు నగరంలో సాగాయి.

ప్రజాశక్తి - గాజువాక : డబ్బులు తమకు ఇవ్వలేదంటూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఇంటి వద్ద, పాత గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఓటర్లు ఆదివారం ఆందోళన చేశారు. మిందిలోని అమర్‌నాథ్ ఇంటికి నియోజవర్గ పరిధిలోని శీకువానిపాలెం, సీతానగరం, కైలాస్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఓటర్లు వచ్చారు. తమ ఓట్లుకు డబ్బులు ఎవరూ ఇవ్వలేదని, తామంతా వైసిపి అభిమానులమని అమర్‌నాథ్‌కు వివరించారు. వచ్చిన వారిపై అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరాకు పడాల్సిన పనిలేదని, తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుంటామంటూ అక్కడికి వచ్చిన 100 మంది మహిళలు తింటుకుంటూ వెళ్లిపోయారు. కోరాడకు చెందిన కొంతమంది మహిళలు తమ ఓట్లుకు డబ్బులివ్వలేదంటూ గాజువాక టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో అందుబాటులో ఉన్న నాయకులు వారితో మాట్లాడి సర్ధిచెప్పి పంపించేశారు.

ఎంవివి సత్యనారాయణ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

ఎంవిపి.కాలనీ : తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తూర్పు నియోజకవర్గంలోని 19వ వార్డు అప్పుఘర్, వాసవానిపాలెం, జాలారు పేటకు చెందిన సుమారు వెయ్యి మంది ఒక్కసారిగా ఆయన ఇంటిని, కార్యాలయాన్ని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకుగాను తమ సమీప ప్రాంతాలలో ఓటుకు రూ.2500 నుంచి రూ.5000 వరకు చెల్లించారని, తమకు కూపన్లు ఇచ్చి మూడు రోజులు కావస్తున్నా ఎవరూ తమకు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ఇస్తే అందరికీ ఇవ్వాలి.. లేదంటే ఎవ్వరికీ ఇవ్వకూడదు.. కొంతమందికి ఇచ్చి కొంతమందికి ఇవ్వకపోతే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ప్రజల తాకిడి పెరగడంతో ఎంవివి.సత్యనారాయణ సిబ్బంది గేటుకు తాళాలు వేసి పరారయ్యారు.

దక్షిణంలో ఇలా..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కొక్క ఓటుకు రూ.1000 చొప్పున పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థి తరపున మూడు రోజుల నుంచే ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అధికార వైసిపి అభ్యర్థి తరపున శనివారం రాత్రి కొన్ని ప్రాంతాలలోనూ, ఆదివారం సాయంత్రం మరికొన్ని ప్రాంతాలలోనూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లమ్మ తోట, బుక్కా వీధి, ఎల్లంపేట, చిలకపేట, పాత లక్ష్మి టాకీస్ ప్రాంతాల్లో అధికార పార్టీ వార్డు నాయకులు, చోటామోటా నాయకులు అభ్యర్థి నుంచి డబ్బు తీసుకొని పంపిణీ చేయకుండా స్వాహా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలియడంతో ఈ ప్రాంతాలలోని ఓటర్లు ఆయా వార్డుల్లో ఉన్న పార్టీ వార్డు నాయకుల ఇళ్లకు వెళ్లి వారితో తీవ్రస్థాయిలో గొడవలకు దిగారు. దీనిని గమనించి కొంతమంది వార్డు నాయకులు ఇళ్ల నుంచి పరారయ్యారు. కొన్ని వార్డుల ఓటర్లు గణేష్ కుమార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. జ్ఞానాపురం ప్రాంతంలో కూటమి అభ్యర్థి తరపున డబ్బు పంపిణీలోనూ ఇదే విధంగా జరిగింది.



ఎంవివి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

వేసవి తాపం ఉపశమనానికి తాటి ముంజెలు

చక్కెర, మినరల్స్ పుష్కలం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుత వేసవిలో తాటి ముంజెలకు భలే డిమాండ్ ఉంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పవచ్చు. వేసవిలో ముఖంపై వచ్చే మొటిమలకు విరుగుడుగా ఈ తాటి ముంజెలు పనిచేస్తాయి. శరీరానికి కావలసిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహదపడతాయి. ఇవి తినడం వల్ల జీర్ణ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. శరీరానికి కావలసిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్ వంటివి పుష్కలంగా ఉండడంతో ఆరోగ్యపరంగా ఎంతో ఉపయోగ పడతాయి. శరీర బరువు తగ్గడలకు ఉపకరిస్తాయి.

ఆరోగ్యానికి మేలు..

తాటి ముంజెలు తింటే శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహద పడతాయి. ఎండా కాలంలో వేడికి సాధారణంగా మల బద్ధకం ఏర్పడుతుంది. తాటి ముంజెలు తింటే మల బద్ధకం తగ్గుతుంది.



దాక్టర్ కె.రామారావు
తగరపువలస

కష్టం తో కూడిన పని..

తాటి కాయలనుంచి ముంజెలను తీయడంలో నైపుణ్యంతో పాటు శారీరక శ్రమ ఇమిడి ఉంటుంది. గీత కార్మికులు అనేక కష్టాలు పడుతూ, వీటిని తీసి అమ్ముతుంటారు. అయితే వీరికి వచ్చే ఆదాయం మాత్రం అంతంత మాత్రమే. తాటికాయలు తీసే క్రమంలోనూ, చెట్టు ఎక్కి దిగిన సందర్భంలోనూ మెళకువలు పాటించాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే గీత కార్మికులు ఎంతో సాహసం చేయాల్సి ఉంటుంది.



తాటి ముంజెలు తీస్తున్న గీత కార్మికుడు

తాటి కాయల్లో రకాలు..

తాటి కాయల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. ఉప్పర తాటి, కుంచాల తాటి, గజ తాటి, నల్ల కాయల తాటి లాంటి రకాలు ఉన్నాయి. రకాన్ని బట్టి ముంజె ఆకారం, రుచి ఉంటుంది. నల్ల కాయల తాటి ముంజెలు ఎంతో శ్రేష్టమైనవని చెబుతుంటారు.



చీరలు పంపిణీ చేస్తున్న తిప్పల నాగిరెడ్డి, అండిబోయిన దంపతులు

చీరల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : అండిబోయిన అప్పారావు యాత కార్పొరేషన్ డైరెక్టర్, హైకోర్టు న్యాయవాది అండి బోయిన లక్ష్మి వివాహ దినోత్సవం సందర్భంగా ఆదివారం సమతానగర్‌లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై మాట్లాడుతూ, అండిబోయిన అప్పారావు, లక్ష్మి దంపతులు పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. వీరిద్దరూ మంచి క్రీడాకారులన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, వైఎస్ఆర్‌టియుసి నాయకులు మస్తానప్ప, స్థానిక నాయకులు వేంపాడు అప్పారావు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్ శిక్షణా శిబిరాన్ని సందర్శించిన నరసింహారావు

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణా శిబిరాన్ని పిఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు నరసింహారావు ఆదివారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న బాల బాలికలకు పాలు, కోడి గుడ్లు, బిస్కెట్లు అందజేశారు. శిక్షణా శిబిరం నిర్వాహకులు బి.వరదేశి, గౌతమ్, వైసిపి నాయకులు తమ్మిన అశోక్ పాల్గొన్నారు.

అరకు-కొత్తవలస లైన్‌లో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ నేతృత్వంలో అరకు-కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, డబుల్ లైన్ పనులు, భద్రతా చర్యలపై సమీక్షను నొక్కి చెప్పారు. ఎడిఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్ కుమార్ సాహూ, సివిల్ ఇంజినీరింగ్, ఆపరేషన్స్, ఎలక్ట్రికల్, సిగ్నల్ టెలికాం, సేఫ్టీ, ఇతర విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు డిఆర్ఎం సౌరభ్ విభాగంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులు, వ్యూహాత్మక ప్రణాళిక కార్యక్రమాల పురోగతిని ప్రసాద్ నిశితంగా విశ్లేషించారు.

తనిఖీ సందర్భంగా, డిఆర్ఎం ప్రసాద్ డబ్లింగ్ పనులు, సొరంగాలు, పాయింట్లు, క్రాసింగ్‌ల పురోగతి, వంతెన నిర్వహణ కార్యకలాపాలు, ట్రాక్షన్ సబ్-స్టేషన్లు, సౌకర్యాలు, సైడ్‌వాల్ రక్షణ, నీటి పరీవాహక ప్రాంతాల వంటి భద్రతా చర్యలను స్వయంగా పరిశీలించారు. ప్రయాణీకుల భద్రత, రైల్వే మౌలిక సదుపాయాలను నిర్ధారించడానికి టన్నెల్ ప్రాంతాలకు సమీపంలో నీటి ప్రవాహం, బురద ప్రవహించే ప్రమాదాలను తగ్గించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఇంకా డిఆర్ఎం ప్రసాద్ శివలింగాపురం, త్యాడ స్టేషన్లలో భద్రతా తనిఖీలు నిర్వహించారు. కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లు మరియు ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకున్నారు. కొత్తవలస వరకు ఉన్న సెక్షన్‌లో సమగ్ర విండో ట్రయిలింగ్ తనిఖీ కూడా నిర్వహించారు.



అరకు- కొత్త వలస లైన్‌లో పనులను పరిశీలిస్తున్న డిఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ తదితరులు

బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ



రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న సోములు

ప్రజాశక్తి- గోపాలపట్నం : గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యాన మదర్స్ డే సందర్భంగా గోపాలపట్నం కళాసేవా పీఠం అధ్యక్షులు నందవరపు సోములు ఆధ్వర్యాన బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు. ముందుగా గోపాలపట్నం 30 పడకల ఆసుపత్రిలోని నందవరపు సోములు మాతృమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ, మదర్స్ డే సందర్భంగా తల్లిని గౌరవించడం సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు కంపర అప్పారావు, చందు సుబ్బారావు, గరకల రామదాసు, కొంతం నూకరాజేశ్వరరావు, రామచంద్రరావు, నవీన్ మాస్టర్, శ్రీనివాస్, భాస్కర్ పాణిగ్రహి, కన్నంనాయుడు, గంపల అప్పారావు, అందిపోయిన శ్రీనివాసు, జి సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా ఎంజి శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజి (మోరిస్ గ్యారేజెస్), 100-సంవత్సరాల లిమిటెడ్ మోడల్ వాహనాన్ని విశాఖలో విడుదల చేసింది. బీచ్ లోని కాళీ మాత టెంపుల్ పక్కన ఉన్న ఎంజి మోటర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంజి మోటార్ ఇండియా, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సతిందర్ సింగ్ బజ్వా మాట్లాడుతూ, 110 సంవత్సరాల బ్రిటిష్ రేసింగ్ చరిత్రకు మారు పేరుగా నిలిచిన దిగ్గజపు ఎవ్వర్ గ్రీన్ రంగును ఈ వాహనం పరిచయం చేసిందని వంద సంవత్సరాలకు పైగా రేసింగ్ చరిత్రను సంబరం చేస్తూ, ఈ లిమిటెడ్ ఎడిషన్ మోడల్స్ ఎంజి ని ప్రయాణికుల ముందుకు తీసుకువచ్చిందని అన్నారు. ఈ ఎడిషన్ 'ఎవ్వర్ గ్రీన్' ఎక్స్ టీరియర్ లో, బ్లాక్ ఫినిష్ రూఫ్ తో డార్క్ ఫినిష్ ఎలిమెంట్స్ తో టెయిల్ గేట్ పై '100-సంవత్సరాల ఎడిషన్' బ్యాడ్జితో పాటు లభిస్తుందని తెలిపారు. ఈ 100 సంవత్సరాల లిమిటెడ్ ఎడిషన్ విడుదల తమ దీర్ఘకాల వారసత్వానికి ఆటోమోటివ్ శ్రేష్ఠత కోసం అభిరుచికి రుజువుగా నిలిచిందని 'ఎవ్వర్ గ్రీన్' రంగు తమ సంస్థలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందని, తమ వారసత్వం కోసం పేరు పొందిన బ్రాండ్‌గా ఎంజి తమను తాను స్థిరపరచుకునే లక్ష్యాన్ని కలిగి, రాబోయే సంవత్సరాల్లో కస్టమర్స్ కోరుకున్న విధంగా కొనసాగిస్తుందని తెలిపారు.

కిరాణా స్టోర్లు బి 2 బి ఈ-కామర్స్ ఆఫర్లు స్వీకరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ : ఆధునిక డిజిటల్ యుగంలో రిటైల్ రంగంలో మూల స్తంభాలైన కిరాణా స్టోర్లు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నాయని, వీటిని అధిగమించేందుకు, కిరాణా స్టోర్లలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం కోసం, సామర్థ్యాన్ని పెంచి పోటీ తత్వ ప్రయోజనాన్ని పెంపొందించడం కోసం శక్తివంతమైన పరిష్కారాలను అందిస్తున్నందున బి2 బి ఈ కామర్స్ ద్వారా ప్రయోజనం పొందుతున్నారని సంస్థ ప్రతినిధి తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, కిరాణా స్టోర్లను, వారి ఇళ్ల సౌలభ్యాన్ని బట్టి 24/7 ఆర్డర్లను ఇవ్వటానికి ఈ సౌకర్యం పడుతుందన్నారు. ఇందుకు కేవలం ఇంటర్నెట్ కనెక్షన్ మాత్రమే అవసరం అన్నారు.

ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం

ఎన్నో సంవత్సరాల కలకు సాకారం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గంలో ఉన్న క్రీడాకారులకు ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమవుతోంది. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టాలని ఏడెకరాలు విస్తీర్ణంలో 1999వ సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు నలుగురు ఎమ్మెల్యేలు మారారు తప్ప పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం, తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. నాలుగు సార్లు శంకుస్థాపన చేయడమే జరిగింది తప్ప, ఒక పైసా పని కూడా జరగలేదు. ఈ ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డి రూ.ఐదు కోట్లు వ్యయంతో దీనికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన తర్వాత స్థానిక ఇంజినీరింగ్ అధికారులు గత నెల రోజులుగా పనులు కూడా మొదలుపెట్టారు. మొదట్లో యువకులు దీనికి సంబంధించిన డిజైన్ సరిలేదని గొడవ చేశారు. ఇంజినీరింగ్ అధికారులు దానికి వివరణ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం గోతులు పూడ్చే కార్యక్రమం పూర్తయింది. సిమెంట్ పనులు కూడా మరో రెండు రోజుల్లో చేపట్టనున్నారు. ఏడాదిలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు పట్టుదలతో ఉన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే గాజువాక నియోజకవర్గ క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుందని యువకులు ఆశతో ఎదురుచూస్తున్నారు. గాజువాకలో మరెక్కడా ఇంత విశాలమైన క్రీడామైదానం అందుబాటులో లేదు. ప్రభుత్వ స్థలం కూడా ఎక్కడా లేదు. అందరూ దీని పట్ల ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఆదర్శ గ్రౌండ్‌లో నిర్మాణ పనులకు వేసిన ఇసుక, రాయి తదితరాలు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
సోమవారం
13 మే 2024

కలం మాట





ప్రజాస్వామ్యం పరిహాసం...



పకపక నవ్వింది ప్రజాస్వామ్యం
కొనుక్కుంటున్న పాలకులను చూచి
అమ్ముకుంటున్న పౌరులను గాంచి
అధికార పక్షముదో మాట
ప్రతిపక్షముదో మాట
అందరూ సేవకులే మాటల్లో
అందరూ మహనీయులే హామీల్లో
వినేవారు తేల్చుకోలేరు
ఎవరి లెక్కలు వారివే
ఎప్పుడైనా ఒకటే ఫలితం
ఎవరో ఒకరు గెలుస్తారు
ఓటర్లే ఓడిపోతారు
రెండు పక్షాలలో ఒకటి గెలుస్తుంది
దేహాలు మారుతాయి
ధ్యేయం మళ్లీ అదే
మనుష్యులు మారుతారు
ఆలోచనలు అవే
రైతులు కష్టాలు తీరవు
పేదలు బతుకులు మారవు
పేర్లు మార్పు పథకాలు అవే
గోరంత విదల్చి కొండంత ప్రచారం
ప్రజలకు నూకలు
పాలకులకు రూకలు
దోపిడీ దురాక్రమణ
చీకటి సంపాదన
ధనవంతులు పైపైకి
బీదరికం మరింత కిందకు
ప్రతిపక్షాలు మండిపోతుంటాయి
నటిస్తూ
అధికారపక్షము
ఎదురు తిరుగుతుంది
భ్రమింపజేస్తూ
సామాన్యుడు చంకలు గుద్దుకుంటాడు
అదే నిజమని
తెర ముందే నాటకం
తెరవెనుక మేకప్ తీసేస్తే అందరూ ఒకటే
రంగులు వేరు
రక్తము ఒకటే
జెండాలు వేరు
అజెండా ఒకటే
వారసుల ప్రగతి
ఆస్తుల పురోగతి
ఈడ్చి తన్నినా ఒకటే
తన్ని ఈడ్చినా ఒకటే
స్వాతంత్ర్యము వచ్చినా..
సంవత్సరాలు గడిచినా..
రాజ్యాంగం రాసినా
ఎన్నికలు జరిపినా
అన్నీ వేదికలు మీదే వెలుగుపోతాయి
భారతావనిలో ఎప్పుడూ చీకటే..
అందుకే ప్రజాస్వామ్యం నవ్వింది
తనను తాను చూసుకుంటూ.

-చిన్న సూరి
(సిహెచ్.చిన సూర్యనారాయణ)
మొబైల్ : 94416 62716

ఓటుతో తిరస్కరించు..?



ఓటును నోటుతో ముడి పెట్టవద్దు
విందు పొందు పసందసలే వద్దు
దుష్టులను దూరముంచుట ముద్దె
దగుల్బాజీలను దగా కోరులను
వెంట పెట్టుట ముద్దు
దౌర్జన్యకారులను
చెప్పుతో కొట్టినట్లు
ఓటుతో తిరస్కరిస్తే ముద్దు
అరాచక పాలనను
తిరస్కరించుట ముద్దు
దేవాలయాలను
దేవుని విగ్రహాలను
ధ్వంసం చేయించిన వారికి
ఓటుతో తగిన శాస్తి చెప్పుట
నూటికినూరు పాళ్లు ముద్దు
రౌడీజియంతో
చట్టాలు, న్యాయస్థానాలు
వద్దేవద్దు అనే నపుంసకునికి
ఓటుతో పాతి పెట్టుట ముద్దు
నిరంకుశ పాలకులకు
నియంతలా ఉన్న వారికి
నీ ఓటు అనే వజ్రాయిధంతో
అంత మొందించుట
అసలు సిసలైన ముద్దే ముద్దు


- డాక్టర్ పి.సింహాచలం,
విశాఖపట్నం.

ఓటరూ... మేలుకో.!

ప్రశ్నించడం మానేశావ్
అన్యాయం అని తెలిసిన అడ్డుకోలేవు
ఎదిరించే ధైర్యం అంతకన్నా లేదు
అంతమాత్రం చేత
ఏమీ చేయలేననిఅనుకోకు
ఓటరు ఎన్నికలు జరిగే ప్రతిసారి
నీ శక్తి నీకే తెలియని
హనుమంతుడులాంటి వాడివి
హనుమ ఆయుధం గధ అయితే
నీ ఆయుధం నీ ఓటు.
ఓటు అనే ఆయుధంతో
దుర్మార్గులను శిక్షించు
ప్రజాస్వామ్యాన్ని రక్షించు...

- విశ్వశాంతి
(వై.అప్పారావు),
మొబైల్ : 89194 15804

ఓటుకు వేళాయే..!



- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ఓటరు చేతితో అభ్యర్థుల భవితవ్యం
- ఓటు వినియోగం, నిర్ధారణపై అవగాహన

సార్వత్రిక ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంది. ఎన్నికల సంఘం, అధికారులు, రాజకీయ పార్టీలు, పోటీ అభ్యర్థులు ఇలా ఎవరి పనిని వారు కానిచ్చేశారు. ఇపుడు ఓటర్ల వంతు వచ్చింది. నచ్చిన, మెచ్చిన అభ్యర్థిని ఎంపిక చేసుకోవడం మిగిలి ఉంది. దీనికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో బటన్ నొక్కి ఓటేయడమే తరువాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటి, రాజ్యాంగబద్ధ హక్కుగా దక్కిన అత్యంత అమూల్యమైన ఓటును అప్రమత్తతతో, సక్రమంగా వినియోగించుకోవడం ఇపుడు ఓటరు చేతిలోనే ఉంది. దేశం, రాష్ట్రం, ప్రజా ప్రయోజనంతోపాటు భావితరాల భవిష్యత్‌ను నిర్దేశించే ఓటు ఎలా వేయాలనే దానిపై అనేకమందిలో సందేహాలున్నాయి. ఈ నేపథ్యంలో ఓటరు స్లిప్పు పొందడం నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఇవిఎంలలో ఓటేయడం. అది సరిగా నమోదైందో లేదో నిర్ధారించుకోవడంపై ఓటర్లలో అవగాహనకు ఓసారి పరికిద్దాం.

(ప్రజాశక్తి- విశాఖపట్నం)

ప్రతి ఓటరూ రెండు ఓట్లేయాలి...

ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి.ప్రతి ఓటరూ తమ పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యేను ఇద్దరినీ ఎన్నుకోవాల్సి ఉంది. దీనికోసం ఒక్కొక్కరు రెండేసి ఓట్లేయాల్సి ఉంది, పోలింగ్ కేంద్రంలో రెండు ఇవిఎం మిషన్లలో ముందుగా ఎంపీ స్థానానికి, తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటేయాల్సి ఉంటుంది.

పోలింగ్ కేంద్రాన్ని నిర్ధారించుకోవాలి..

ప్రతిఒక్కరూ తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందో ముందుగా నిర్ధారించుకోవాలి.దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఓటరు స్లిప్పులను అందజేశారు. వాటిల్లో ఓటరు పేరు, ఓటరు జాబితాలో ఎన్నో సీరియల్ నెంబరులో ఉన్నదీ, పోలింగ్ కేంద్రం ఇతరత్రా సమాచారం ఉంటుంది. ఒక వేళ ఓటరు స్లిప్ అందకపోతే, హెల్ప్‌లైన్ యాప్, మొబైల్‌లో ఆన్‌లైన్‌లోఇతరత్రా మార్గాల్లో పొందవచ్చు.

ఓటరు స్లిప్, గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి...

పోలింగ్ రోజున నిర్దేశించిన సమయంలో ఓటరు స్లిప్, ఎన్నికల సంఘం అనుమతించిన గుర్తింపు కార్డులతో పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. పోలింగ్ బూత్‌లో మొదట్లో ఉన్న అధికారికి ఓటరు స్లిప్‌ను ఇస్తే, జాబితాలోని వివరాలతో సరిపోల్చి, పేరుతో సహ జాబితాలోని సీరియల్ నెంబర్‌ను చదివి వినిపిస్తారు. అభ్యర్థుల తరుపున పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న వ్యక్తులు వాటిని సరిచూసి,ఎటువంటి అభ్యంతరం లేదని ఓకే చెబితే టిక్ మార్కు పెట్టుకున్నాక, ముందుకు పోనిస్తారు.



ఓటుకు అనుమతిస్తూ రిజిస్టర్‌లో సంతకం..

తర్వాత మరో పోలింగ్ అధికారి వద్దకు వెళితే, తన వద్దనున్న రిజిస్టర్‌లో ఓటరు, పేరు వివరాలను నమోదు చేసుకుని, ఓటరుతో సంతకం చేయిస్తారు. ఓటేసినట్లు నిర్ధారణకు ఎడమచేతి చూపుడు వేలిపై సిరా రాసి, ఒక చీటి ఇస్తారు. తర్వాత మూడవ పోలింగ్ అధికారి వద్దకు వెళ్లి చీటిని అందిస్తే, చూపుడు వేలిపై సిరా గుర్తును తనిఖీ చేసి, ఓటేయడానికి అనుమతిస్తారు.అప్పుడు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి, ఇవిఎంలలో ఓటేయాలి.

బీప్ శబ్దం వస్తేనే ఓటేసినట్లు...

ఓటింగ్ కంపార్టుమెంట్‌లోని ఇవిఎం బ్యాలెట్ యూనిట్‌లో ఒక క్రమంలో అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులు ఉంటాయి.వాటిపై నీలిరంగు బల్బు వెలుగుతూ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌లో నచ్చిన అభ్యర్థి పేరు, ఎన్నికల గుర్తును పరిశీలించి, నిర్ధారించుకున్నాక దానికి ఎదురుగా ఉన్న నీలిరంగు బటన్‌పై నొక్కితే, ఆ గుర్తు పక్కనే ఉన్న ఎరుపు బల్బు వెలగడంతోపాటు బీప్ శబ్దం వస్తుంది. పక్కనే ఉన్న వివి ప్యాట్‌లో ఎవరికి ఓటేశారో అభ్యర్థి పేరు, క్రమసంఖ్య, గుర్తుతో కూడిన స్లిప్ కేవలం ఏడుసెకన్లు పాటు మాత్రమే కనిపిస్తుంది. తర్వాత వివి.ప్యాట్ డబ్బాలో పడిపోతుంది..దీంతో ఓటేసే ప్రక్రియ పూర్తయినట్లే.

సందేహాలుంటే ఫిర్యాదు చేయొచ్చు...

ఇవిఎం బ్యాలెట్ ప్యాడ్‌లో బటన్ నొక్కిన తర్వాత ఎరుపు బల్బు వెలగకపోయినా, బీప్ శబ్దం రాకపోయినా, వివి ప్యాట్ పెట్టెలో చీటి కనిపించకపోయినా వెంటనే అక్కడే ఉన్న ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అన్ని సందేహాలు, సంశయాలను నివృత్తి చేసుకున్నాకే పోలింగ్ కేంద్రం నుంచి బయటకు రావాలి.

ఇసి అనుమతించిన గుర్తింపు కార్డులివే..

పోలింగ్ కేంద్రానికి ఓటరు స్లిప్పుతో వెళ్లిన ఓటరు తానేనని నిర్ధారించుకోవడానికి పోలింగ్ అధికారులకు గుర్తింపు కార్డు చూపాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు (ఎపిక్) కార్డు ఉంటే సరేసరి, లేకుంటే ఎన్నికల సంఘం కొన్ని ఫొటో గుర్తింపు కార్డులను అనుమతించింది. ఓటరు స్లిప్పుతోపాటు వాటిల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో వెళితేనే ఓటింగ్‌కు అనుమతిస్తారు.

- ★ ఓటరు గుర్తింపు కార్డు
- ★ ఆధార్ కార్డు
- ★ ఉపాధిహామీ జాబ్‌కార్డు
- ★ డ్రైవింగ్ లైసెన్స్
- ★ పాన్‌కార్డు
- ★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఆయా సంస్థలు జారీ చేసిన ఫొటోలతో కూడిన సర్వీసు గుర్తింపు కార్డు
- ★ ఫొటోలతో ఉన్న బ్యాంకు, పోస్టాఫీస్ పాస్ పుస్తకం
- ★ యూనిక్ డిజెబిలిటీ(యుడి) ఐడి కార్డు
- ★ కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు
- ★ ఆర్‌బిఐ జారీచేసిన ఎన్‌పిఆర్ స్మార్ట్ కార్డు
- ★ ఫొటోతో ఉన్న ఉద్యోగి పెన్షన్ డాక్యుమెంట్
- ★ ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు



చెరగని సిరా వదంతులను నమ్మొద్దు!

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



ప్రజాశక్తి- విశాఖపట్నం : చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై వారి ఇంటి వద్దే మార్కు చేస్తూ, ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. ఎన్నికల్లో చూపుడు వేలిపై రాసే సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రయివేటు వ్యక్తులు సేకరించడానికి గానీ, వినియోగించడానికి గానీ వీలులేదన్నారు. కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది వద్ద పోలింగ్ సమయంలో మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లకు గుర్తు పెట్టడానికి మాత్రమే ఉపయోగిస్తారని, ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు అపోహలకు గురికాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున సూచించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి



పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో వినియోగించనున్న పోలింగ్ మెటీరియల్ పంపిణీ పూర్తయింది. ఆదివారం ఉదయం ఏడు గంటలకు మొదలైన ప్రక్రియ సాయంత్రంతో ముగిసిపోయింది. మొత్తం 207 రూట్లు ఉండగా వాటికి 152 మంది సెక్టోరల్ అధికారులను నియమించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 9,627 బ్యాలెట్ యూనిట్లను, 4,681 కంట్రోల్ యూనిట్లను, 5,040 వీవీప్యాట్లను నియమిత అధికారులకు ఏయూలో ఏర్పాటు చేసిన ఏడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా అందజేశారు. 207 రూట్లకుగాను సుమారు 707 వాహనాలను కేటాయించి వాటి ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని గట్టి బందోబస్తు మధ్య తరలించారు. పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు సుమారు 12 వేల మంది బస్సులు ద్వారా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున దగ్గరుండి పర్యవేక్షించారు. ఎలాంటి లోపాలూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గ కౌంటర్ దగ్గరకు వెళ్లి అక్కడ పరిస్థితిని గమనించారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని అందిస్తున్నారా లేదా అనే అంశాలపై అక్కడి అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్, తూర్పు నియోజకవర్గ ఆర్వో కె.మయూర్ అశోక్, ఎంసీసీ నోడల్ అధికారి సిఎం.సాయికాంత్ వర్మ, ఏడీసీ కెఎస్.విశ్వనాథన్, ఆయా నియోజవర్గాల ఆర్వోలు, సెక్టోరల్ అధికారులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల యంత్రాంగం



ఎన్నికల యంత్రాంగానికి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున



పోలింగ్ కేంద్రాలకు సరంజామాతో తరలివెళ్తున్న అధికారులు, సిబ్బంది

ఎయు ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద సామగ్రి తరలింపు, ఇతర ప్రక్రియలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. అధికారులకు తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు.ఎంసిసి. నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎడిసి కెఎస్. విశ్వనాథన్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు, ఇతర అధికారులు ఉన్నారు. కాగా ఎన్నికల్లో భద్రతపై సిపి రవిశంకర్ సూచనలు చేశారు.కాగా పోలింగ్ సామగ్రిని అందుకున్న పిఒలు, ఎపిఒలు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులు, ఇతర వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ సందర్భగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు.

(ప్రజాశక్తి- విశాఖపట్నం)



పోలింగ్ సిబ్బంది సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు



భద్రతా ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి- మునగపాక

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని స్థానిక ఎస్సై ప్రసాదరావు కోరారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాటు పరిశీలనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవచ్చని చెప్పారు. గ్రామాలలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, ఐదుగురు కంటే ఎక్కువ ఉండరాదని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉద్దేశపూర్వకంగా గాని రాజకీయంగా గాని ఎవరైనా గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి

ఇంటలిజెన్స్ హెచ్చరికతో పోలీసుల అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు విద్రోహక చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని ఇంటలిజెన్స్ వర్గాలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సురక్షితంగా ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు చేరే విధంగా పగడ్బంది చర్యలు చేపట్టారు. మావోయిస్టులు ఎటువంటి చర్యలకు ఉపక్రమించిన దీటుగా ప్రతిఘటించడానికి కేంద్ర పోలీస్ బలగాలను రంగంలో దింపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు ముందస్తుగానే పోలీసులు చేరుకొని అణువణువునా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మావోయిస్టుల కదలికలు, వారికి సహకరించే సానుభూతిపరులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మూలమూరు గిరిజన గ్రామాల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, ఆక్టోపాస్ తదితర బలగాలను వందల సంఖ్యల్లో దింపి జల్లెడ పడుతున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో 50 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మావోయిస్టులు పోలీసు బలగాలను తరలిస్తున్న వాహనాలు లక్ష్యంగా చేసుకొని గ్రానైట్స్, ల్యాండ్ మైన్స్‌తో ప్రతీకార దాడులకు పాల్పడవచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బాంబు స్క్వాడ్ బృందాలతో ముందస్తుగా క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ బలగాలను జీకే వీధి మండలం సీలేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా, కల్వర్టులు, ముఖ్య కూడళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆదివారం వారపు సంతలో మావోయిస్టు సానుభూతిపరులు యాక్షన్ టీం సభ్యులు సంచారంపై దృష్టి సారించి ఆ దిశగా గోప్యంగా తనిఖీలు చేపట్టారు. పోలింగ్ బూతులు ఏర్పాటు చేసిన సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. జికె.వీధి సిఐ, ఎస్ఐల ఆధ్వర్యాన మండలంలోని ఆదివారం రహదారులు, కల్వర్టులు మెటల్ డిటెక్టర్లతో, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు.

ఆధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా

మావోయిస్టుల కదలికలపై అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టినట్లు సిఐలు అశోక్ కుమార్, అప్పలనాయుడు, జికె.వీధి ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఉపయోగిస్తున్నామన్నారు. మావోయిస్టు ఎటువంటి చర్యలకు ప్రయత్నించినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో భాగంగానే అనుమానిత ప్రదేశాలను డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తాము వినియోగిస్తున్న డ్రోన్ కెమెరాలతో ఎన్నికలు ఓటింగ్ జరిగే ప్రదేశం నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో మావోయిస్టులు కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు సృష్టించకుండా ప్రతి ఒక్కరూ పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపు



పోలింగ్ కేంద్రాలకు అధికారులను తరలించేందుకు యలమంచిలిలో సిద్ధంగా ఉన్న బస్సులు

చోడవరం : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు చోడవరం నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాల పోలింగ్ అధికారులు, సిబ్బంది సామాగ్రి చోడవరం ప్రభుత్వ హైస్కూల్ క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం మండలాలకు తరలివెళ్లారు. చోడవరం బుచ్చయ్యపేట రావికమతం, రోలుగుంట మండలాల్లో 245 పోలింగ్ బూతులు ఉన్నాయి. వీటికి సంబంధించి అధికారులు ఎన్నికల సిబ్బంది వాహనాల్లో పోలింగ్ సామాగ్రితోపాటు తరలి వెళ్లారు.

బుచ్చయ్యపేట : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రానికి మండలంలోని 63 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. **కె.కోటపాడు** : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని 32 పంచాయతీలకు చెందిన 62 పోలింగ్ బూత్‌లలో సోమవారం జరిగే ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మాడుగుల నియోజకవర్గ కేంద్రం నుండి పోలింగ్ అధికారులు ఈవీఎంలతో ఆదివారం సాయంత్రానికి విచ్చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి నియోజకవర్గంలో సోమవారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్‌లలో నాలుగు మండలాలకు అవసరమైన ఎన్నికల సామాగ్రి పోలింగ్ అధికారులకు అందజేశారు. సుమారు 1500 మందికి ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. వారిని 72 బస్సుల్లో గమ్య స్థానాలకు చేర్చారు. ఈ బస్సుల్లో 36 ఆర్టీసీవి కాగా, మిగిలినవి ప్రైవేటువని రిటర్నింగ్ అధికారి మనోరమ తెలిపారు. లోతట్టు ప్రాంతమైన క్రీడా మైదానంలో వర్షం పడినా నీరు చేరకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తహశీల్దార్ అప్పలరాజు తెలియజేశారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు స్థానిక సిఐ గఫూర్ తెలియజేశారు. ఏటికొప్పాక, జంపపాలెం, పూడిమడక, కొత్తపట్నం, పిఎన్ఆర్‌పేట మొదలైన ప్రాంతాల్లో నిఘా పెంచి డిఎస్పీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో డిఎస్పీ ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు, 12 మంది ఎస్ఐలు, 8 మంది సిఐలు, సాయుధబలగాలతో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు.



చోడవరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి వెళ్తున్న ఉద్యోగులు

కలెక్టర్ సందర్శన

అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ రవి పటాన్ శెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా ఈవీఎంల సామాగ్రి పంపిణీ పరిశీలించారు. పోలింగ్ సామాగ్రితో సిబ్బంది వివిధ పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ రవి పటాన్ శెట్టి పలు సూచనలు చేశారు.



అనకాపల్లి ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగులు

ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట చర్యలు

పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి దిశా నిర్దేశం



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ, చిత్రంలో జెసి జాహ్నవి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టిగా శ్రమించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అప్రమత్తతతో పని చేయాలని, నిష్పక్షపాతంగా ఎలాంటి అలసత్వం లేకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. అనకాపల్లి నియోజకవర్గంలో పోలింగ్ విధులకు వెళ్తున్న సెక్టార్ పోలీసు అధికారులు/ రూట్ ఆఫీసర్లు సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో సోమవారం జరిగే పోలింగ్ రోజు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో దిశానిర్దేశం చేశారు. పోలింగ్ లొకేషన్ బందోబస్తు సిబ్బంది నుండి మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్సు, క్యూఆర్టీ, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాల వరకు అందరూ సమన్వయంతో శ్రమించాలన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముంటే వెంటనే ఉన్నతాధికారుల, ఎన్నికల అధికారుల దృష్టికి తీసికెళ్లి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. క్యూలైన్ నిర్వహణ చేపట్టాలని, ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే బందోబస్తు సిబ్బంది పోలింగు స్టేషన్లలోకి ప్రవేశించరాదని చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా గుమిగూడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిశాక ఓటింగు యంత్రాలు స్ట్రాంగు రూమ్‌లకు చేరే వరకు పటిష్ట భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎస్.అప్పలరాజు, ట్రైనీ ఐపిఎస్ అధికారులు, కేంద్ర పోలీస్ దళాలు, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో కుండపోత వర్షం

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు ప్రాంతంలో ఆదివారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12.42 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనంతరం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకున్నాయి. క్షణాల్లోనే ఈదురుగాలులు, పెద్దపెద్ద ఉరుములతో కుండపోత వర్షం గంటన్నర పాటు కురిసింది. దీంతో రోడ్లు, డ్రైనేజీలు జలమయమయ్యాయి. ఏపీజెన్కో కాలనీ వర్షపు నీరుతో డ్రైనేజీ నుండి చెత్తాచెదారాలు కొట్టుకొచ్చి నివాసప్రాంతాల్లో నిల్వ ఉండిపోయాయి. 8వ క్రాస్ రోడ్డు మదుము కింద భాగంలో చెత్త ఇరుక్కుపోయింది. వరద నీరు మసీదు వీధిలో ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గృహిణులు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి భానుడు ప్రతాపంగా, మధ్యాహ్నం కుండపోత వర్షం కురవడంతో చల్లటి వాతావరణం నెలకొంది.

వారపుసంతకు ఆటంకం

కుండ పోత వర్షం కారణంగా సీలేరులో ఆదివారం వారపు సంతకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షం కారణంగా వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. గాలి, వర్షం దాటికి రోడ్లపై దుకాణాలు వేసుకున్న చిరు వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. దుప్పిలివాడ పంచాయతీకి చెందిన గిరిజనులు వారపు సంతకు తెచ్చిన కూరగాయలు అమ్ముకోలేకపోయారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వారపు సంతకు వచ్చిన గిరిజనులు తమకు కావలసిన నిత్యావసరకులు కొనుగోలు చేయడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. జికె.వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురవడంతో దారకొండ వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నం నుంచి వచ్చిన బట్టలు, ఫ్యాన్సీ, తదితర వ్యాపారులు వ్యాపారాలు నిలిచిపోవడంతో డీలాపడ్డారు.



సీలేరులో కురుస్తున్న భారీ వర్షం

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల సామగ్రి తరలింపు-నక్కపల్లిలో భోజనాలకు అవస్థలు పడ్డ ఉద్యోగులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. నక్కపల్లి లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.గీతాంజలి పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రశాంతంగా జరిగింది. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రూట్‌ల వారీగా పిఓలు, ఏపిఓ లు, ఎన్నికల సిబ్బందికి వారికి కేటాయించిన గ్రామాలకు సంబంధించి బూత్‌ల వారీగా ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అందజేశారు. ఉద్యోగులు పోలింగ్ సామాగ్రిని సరిచూసుకున్నారు.



నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో అధిక సంఖ్యలో ఉన్న ఉద్యోగులు

పాయకరావుపేట నియోజకవర్గంలో 292 పోలింగ్ బూత్ లకు సంబంధించి సుమారుగా 1700 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. 28 జోన్లు, 28 రూటులుగా విభజించారు. జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేందుకు కుర్చీలు, బెంచీలు, తార్పాన్లు, టెంట్లు, ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. కళాశాల ఆవరణమంతా ఎన్నికల సిబ్బందితో కిక్కిరిసి పోయింది. ఎండ వేడిమికి తట్టుకోలేక ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు.మధ్యాహ్నం భోజనం అనంతరం ఎన్నికలు విధులకు హాజరైన ఉద్యోగులు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో వారికి కేటాయించిన ప్రత్యేక బస్సులలో పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఎన్నికల పరిశీలకులు రాకేష్ కుమార్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఆర్ఓ గీతాంజలితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 250744 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 123363, మహిళలు 127379, ఇతరులు 4 మంది ఉన్నారు .



కోటవురట్ల నుంచి తరలిస్తున్న సిబ్బంది

ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు

ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగుల్లో కొంతమంది టిఫిన్ కోసం నిరీక్షించవలసి వచ్చింది. మరల టిఫిన్ రప్పించి మిగిలిన వారికి అందజేశారు. బాత్రూముల సదుపాయం సరిగా లేక పోవడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక ఉద్యోగులు ఫ్యాన్, కూలర్ల వద్ద కూర్చుని కొంతసేపు సేద తీరారు. మధ్యాహ్నం భోజనానికి ఉద్యోగులు ఎండలో బారులు తీరారు.

కోటవురట్ల: అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికలకు సంబంధించి సిబ్బంది మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 52 పోలింగ్ కేంద్రాలకు గాను మహిళలు 22754, పురుషులు 21705 ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. 5 రూట్లుగా విభజించి పది మంది అధికారులను నియమించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరించారు. ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



నక్కపల్లిలో క్యూలో ఉన్న ఉద్యోగులు

ఏర్పాట్లు పూర్తి:రిటర్నింగ్ అధికారి జయరాం

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ హెచ్‌వి.జయరాం తెలిపారు. ఆదివారం నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులను తరలించేందుకు 48 బస్సులను ఏర్పాటు చేశారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో 2,08,873 మంది ఓటర్లు ఉన్నారు. వీరు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 262 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 2500 మంది పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను ఎన్నికల కమిషన్ నియమించింది. నియోజకవర్గంను 24 రూట్లుగా విభజించి, 24 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఇద్దరు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పోలింగ్ బూత్ సిబ్బందికి భోజనాలు ఇతర అవసరాల నిమిత్తం ఎనిమిది వేల రూపాయలను కేటాయించారు. ఆదివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తీసుకొని సిబ్బంది ఆయా పోలింగ్ బూత్‌లకు తరలి వెళ్లారు.

కొత్తకోట: రావికమతం మండలంలో సోమవారం నిర్వహించే ఎన్నికలలకు సర్వం సిద్ధం అయ్యింది. మండలంలో సుమారు 61 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 10 మంది సిబ్బంది చొప్పన సుమారు 610 మందిని నియమించారు. మరో మూడు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మండలంలో సుమారు 55,399 మంది ఓటర్లు ఉండగా అందులో 28,541మంది మహిళా ఓటర్లు కాగా 26,858 మంది పురుషులు ఉన్నారు. మండలాన్ని ఆరు విభాగాలుగా విభజించి ఆరు టీమ్ లకు ఆరుగురు రూట్ అధికారులను నియమిం చారు.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. తాగునీరు, టెంట్‌లతో పాటు పోలింగ్ అధికారులకు భోజన వసతి ఏర్పాటు చేశారు..



చదును చేస్తున్న కాలువ స్థలం

కాలువ స్థలం ఆక్రమణ

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో రెవెన్యూ గ్రామమైన కె.వి అగ్రహారం సర్వే నంబర్ 5-8 సమీపంలో గల భూములను ఆనుకొని ఉన్న చెరువుకు నీరు వచ్చే కాలువ ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.

ఇదే రెవెన్యూ గ్రామంలో రెవిన్యూ కొండను ఓ భూ బకాసురుడు సుమారు 70 ఎకరాలు ఆక్రమించుకొన్న అంశంపై పలుమార్లు ప్రజాశక్తి పత్రికల్లో ప్రచురించినా నామమాత్రంగానే, తూతూ మంత్రంగానే రెవెన్యూ అధికారులు దాడులు, కొలతలు అంటూ ఆర్భాటం చేశారు కానీ దానిపై సమగ్ర విచారణ చేపట్ట లేదు. ప్రస్తుతం సమీపంలోనే సర్వే నెంబరు 5-8లో చెరువు కాలువను పలువురు ఆక్రమించుకుంటున్నారు. చెరువుకు వెళ్లే కాలువను అదే చెరువు మట్టితోనే పూడ్చి వేయడం విశేషం. ఇంత జరుగుతున్నా ప్రధాన రహదారికి అనుకొని ఉన్న కాలువ ఆక్రమణపై అధికారులు పట్టించు కోకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కాలువ ఆక్రమణకు గురైతే వర్షపు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలు అరికట్టాలని కోరుతున్నారు.



విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న సిబ్బంది

యధావిధిగా విద్యుత్ స్తంభం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -చీడికాడ: ఇటీవల కురిసిన వర్షాలకు కరెంటు స్తంభం నేల కొరగడంతో పొంచివున్న ప్రమాదం పేరుతో ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.చీడికాడ మండల ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రావు వెంటనే స్పందించి హుటాహుటిన వాలిపోయిన స్తంభాన్ని సిబ్బందితో సరి చేశారు. ఈ మేరకు ప్రజాశక్తిని ఆయన అభినందించారు.

ఓటు కోసం వలస కూలీల రాక

ప్రజాశక్తి- అనంతగిరి: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మండలంలోని వలస కూలీలు తిరుగు గ్రామానికి తరలి వచ్చారు. మండలంలోని ఎన్ఆర్ పురం, భీంపోలు, గమ్మట తదితర పంచాయతీ పరిధి గ్రామాల నుండి గిరినుల్లు పొట్ట కుటి కోసం వలస వెళ్లారు. ఎన్నికలతరుణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు తిరిగి గ్రామాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని ఆదివారం తిరిగి వచ్చారు.

ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు విజయవాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కర్నూలు తదితర ప్రాంతాలకు వివిధ రకాల పనుల కోసం తరలి వెళ్లారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో చేపల చెరువులు, ఇటుకల బట్టీల్లో పనులు చేస్తుంటారు. అక్కడి ప్రాంతాల్లో ఎంతో కాయ కష్టపడి పని చేస్తుంటారు. సంవత్సరంలో సంక్రాంతి, దసరా పండగలకు సాధారణంగా మండలంలోని స్వంత ఊర్లకు వస్తుంటారు. అయితే ఈ ఏడాది ఐదేళ్ల తర్వాత ఎన్నికలు రావడంతో ఓటు వేసేందుకు తరలి వచ్చారు.

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్సై రవీంద్ర ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో వివిధ ప్రాంతాలలో స్పెషల్ పార్టీ బలగాలు, సిఆర్‌పిఎఫ్‌తో వాహనాలు, కలవర్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం కావడంతో నగదు, మద్యం రవాణాకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఉంటుందని, ఓటర్లు , వివిధ రాజకీయ నేతలు సహకరించి పోలింగ్ సజావుగా జరిగేలా సహకరించాలని ఆయన తెలిపారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

విశాఖపట్నం-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం-కోరాపుట్‌కు అదనపు కోచ్‌లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఈస్ట్ కోస్ట్ రైల్వేకు చెందిన వాల్తేరు డివిజన్ ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ నెల 13వ తేదీన విశాఖపట్నం-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలును నడపాలని నిర్ణయించింది.

-రైలు నెంబర్ 08559 విశాఖపట్నం-బ్రహ్మపూర్ అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు విశాఖపట్నం నుంచి ఈ నెల 13వ తేదీన ఉదయం 8.30 గంటలకు బయలుదేరుతుంది, ఇది 13.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 08560 బ్రహ్మపూర్-విశాఖపట్నం అన్‌రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 13వ తేదీన 18.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి 23.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపడ, పలాస, విశాఖపట్నం, బ్రహ్మపూర్ మధ్య ఇచ్ఛాపురంలో హాల్ట్‌లను కలిగి ఉంటాయి. 17 సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, 2 సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ కోచ్‌లు (రిజర్వ్ చేయబడనవి) ఉంటాయి.

వాల్తేరు డివిజన్ విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం రైలుకు ఈ నెల 13, 14 తేదీల్లో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి రెండు అదనపు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను జతచేయాలని నిర్ణయించింది.

4 పాయింట్ 2 టెక్నాలజీతో అత్యాధునిక సాంకేతికత

విశాఖ- కలెక్టరేట్ : అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయటంలో 4 పాయింట్ 2 టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ కె.శివకుమార్ తెలిపారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ వినూత్న సాంకేతికతతో టిడిపి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఓటర్లను ఆకర్షించ గలిగిందన్నారు. తమ కంపెనీ రాజకీయ ప్రచారాలతో నిమగ్నమయ్యే విధానంలో విప్లవాత్మకమైన వినూత్నమైన ఆగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ టెక్నాలజీతో అభ్యర్థుల సందేశాలను కమ్యూనికేట్ చేయడానికి ఇంటరాక్ట్ మార్గాన్ని అందిస్తుందని తెలిపారు. హాలో గ్రాఫిక్ ప్రసంగం ఈ టెక్నాలజీ లక్షణాలలో ఒకటి అన్నారు.

పోలింగ్‌కు అంతా సిద్ధం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పిఒ, ఎపిఒ, నలుగురు ఒపిఒలు పోలింగ్ సామగ్రితో కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. ఈవీఎంలు, వివి ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్‌లతో కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. వీరితో పాటు పోలీసులు కూడా ఉన్నారు.

పెందుర్తి: నియోజకవర్గంలో పరవాడ, సబ్బవరం పెందుర్తితో పాటు ఆరు వార్డుల్లో 289 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. సుమారు 3000 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాలు వద్దకు ఈవిఎంలను, ఎన్నికల సామాగ్రిని తరలించారు. పోలింగ్ బూత్ వద్ద పోలీస్ సిబ్బందితో పటిష్టమైన ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం, టెంట్లు ఏర్పాటుచేశారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహశీల్దార్ వెంకటరావు తెలిపారు. మండలంలో 45 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశామన్నారు. 22 పంచాయతీల్లో 42,145 ఓటర్లు ఉన్నారని, వీరిలో మహిళలు 21,521 మంది, పురుషులు 20624 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికలు సవ్యంగా నిర్వహించేందుకు ఒక ఎసిపి, ఇద్దరు సిఐలు, 140 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

మధురవాడ : సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోనేందుకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లుచేసినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. ఎన్నికలను నిరంతరం మానిటరింగ్ చేసేలా సిపి ఆధ్వర్యాన అత్యాధునిక సాంకేతికతను నగర పోలీసు కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసినట్లు వివరించారు. పిఎం పాలెం స్టేషన్ పరిధిలో ఎక్కడైనా ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే 112 లేదా 9440796060 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



చిట్టివలసలోని జివిఎంసి అంబేద్కర్ హైస్కూల్‌లో విధులకు హాజరైన పోలింగ్ సిబ్బంది

ఊపందుకున్న ప్రలోభాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం

పోలింగ్ వేళ ప్రలోభాలు ఊపందుకున్నాయి. ప్రధాన పార్టీలు ఓట్లకు డబ్బులు ఎరవేస్తున్నాయి. డబ్బులు అందని వారు పలుచోట్ల గలాటా సృష్టిస్తున్నారు.

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్లకు రూ.1500 చొప్పున ఇంటింటికి ఆయా పార్టీల చెందిన కార్యకర్తలు అందజేశారు. ఏ వీధిలో చూసినా ఈ పంపకాలు బహిరంగంగానే సాగాయి. వైసిపి నేతలు ఓటుకు రూ.1500 పంపిణీ చేయగా, తెలుగుదేశం నాయకులు ఒక చీర, రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్పులు లేని వారు, వలస వెళ్లిన వారికి పార్టీలు అందించిన తాయిళాలు అందలేదు.

తెలుగుదేశం పార్టీ వారుగా గుర్తింపు పొందిన వారికి వైసిపి నేతలు డబ్బులు ఇవ్వడంలేదు. అయితే తెలుగుదేశం పార్టీ నేతలు మాత్రం కాలనీలో పార్టీతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ డబ్బులు అందజేశారు. బహిరంగంగా అందరికీ పంపిణీ చేసేటప్పుడు తమకు వైసిపి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ఓట్లకు నోట్లు ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి మా తరంలో ఎన్నడూ లేదని సీనియర్ సిటిజన్స్ వ్యాఖ్యానిస్తున్నారు.

పంపిణీకి దూరంగా సిపిఐ

సిపిఐ పార్టీ తరపున పోటీ చేస్తున్న అత్తిలి విమల మాత్రం ఎక్కడా ఇటువంటి ప్రలోభాలు చేపట్టలేదు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఓటును అభ్యర్థించారే తప్ప తాయిలాల జోలికి పోలేదు. ప్రజాస్వామ్యలు విలువలను కాపాడాలంటే వామపక్ష పార్టీలు చట్టసభల్లో అడుగు పెట్టాలని నిజాయతీపరులు చర్చించుకుంటున్నారు.

ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లుపై ఆరా తీస్తున్న విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో పోలీస్ శాఖ అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నదని, ఈవీఎం రవాణా కొరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనకాపల్లిలోని జీవీఎంసీ మెయిన్ స్కూల్ ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, అనకాపల్లి మండలం రేబాక పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ తీసుకున్న భద్రత ఏర్పాట్లు, పోలింగ్ బూత్‌లో వెబ్ కాస్టింగ్, లైటింగ్, క్యూ లైన్‌ల ఏర్పాటు తదితర విషయాలను పరిశీలించి స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈవీఎంలు రవాణా చేసే సమయంలో పోలింగ్ సిబ్బంది మీద, పోలింగ్ సమయంలోనూ ఎవరైనా గొడవలు చేస్తే వారి మీద తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ హెచ్చరించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండటం వలన ఐదుగురుకు మించి ఎవరు గుంపులుగా తిరగరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవరూ ఉండకుండా చూడాలన్నారు. 200 మీటర్ల దూరంలోనే ఓటర్ల వాహనాలు నిలిపివేయాలని, ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థి వాహనాలను మాత్రమే అనుమతించబడతాయని, అవి కూడా ఆర్వో అనుమతి పొందిన మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారని చెప్పారు. వాహనాలలో ఐదుగురకు మించి ఉండరాదన్నారు. ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించడం జరుగు తుందన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే రూట్ మొబైల్, క్యూ ఆర్ టి టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామని వీరి సమన్వయంతో పనిచేస్తూ అన్ని ప్రాంతాలను కవర్ చేసేలాగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షకాలను పంపిణీ చేస్తుంటే సి విజిల్ యాప్ ద్వారా గాని లేదా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని తెలియాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ అప్పలరాజు, అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా ఆరోగ్య వేదిక నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వైద్యులు సాంబ మూర్తి, మీనేంద్ర కుమార్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వారు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 సంవత్సరం నుండి ప్రతి రెండు నెలలకు ఒకసారి, రెండవ ఆదివారం క్రమం తప్పకుండా కరోనా సమయంలో సైతం వైద్య శిబిరాలు నిర్వహించి, నేటికీ 45వ రెగ్యులర్ మెడికల్ క్యాంప్ జరుగుతుందని చెప్పారు. ఈ మెడికల్ క్యాంప్‌లో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధులకు మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రెగ్యులర్ మెడికల్ క్యాంపు కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక సభ్యులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ఓటర్లకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

సోమవారం జరుగు సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఇటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఓటు హక్కు ప్రజలు వినియోగించుకొనే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు నడవలేని వృద్ధులకు ప్రత్యేక సదుపాయము కల్పించాలని కోరారు. అధిక శాతం ఓటింగ్‌కు రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.